AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
9-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

దళారుల 'పంట' పండుతోంది..!



2



2

వైద్య సిబ్బందికి శిక్షణ

## జిల్లా కలెక్టర్‌కు జీపీవోల వినతి



**అక్షరటుడే, భీమ్ గల్:** కలెక్టర్ ఇలా త్రిపాఠీని జీపీవో సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక సమస్యలపై కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జిల్లా జీపీవోల సంఘం నాయకులు పృథ్వి, కిషన్, శ్రీనివాస్, అశోక్, నితిన్, మాణిక్యం, లింబాద్రి, నవీన్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.





## హెచ్ఐవీపై అవగాహన అవసరం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సమాజంలో ప్రతిఒక్కరికి హెచ్ఐవీపై అవగాహన ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతో భాగంగా జీజీహెచ్‌లో ఎయిడ్స్ అవేర్‌నెస్ వాకథాన్‌ను డీఎంహెచ్‌వో రాజశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎయిడ్స్‌పై అవగాహన ఉంటేనే అది రాకుండా జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ అన్నారు. హెచ్ఐవీ గురించి ప్రతిఒక్కరూ నిర్మొహమాటంగా మాట్లాడాలన్నారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజశ్రీ జీజీహెచ్‌లో సంపూర్ణ సురక్ష కేంద్రం వద్ద రోగ నిర్ధారణ పరీక్షల క్లినిక్‌ను, మైత్రి క్లినిక్ వద్ద ట్రాన్స్‌జెండర్స్ కోసం రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రంను ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జలగం తిరుపతి రావు, జిల్లా టీబీ నియంత్రణ అధికారి దేవి నాగేశ్వరి, డిప్యూటీ డీఎంహెచ్‌వో అశ్విని, ఎన్‌వీహెచ్‌సీపీ వైద్యుడు వెంకటేష్, డీఈ శ్రావ్య, టీబీ మెడికల్ ఆఫీసర్ అవంతి, ఏఆర్టీ సెంటర్ మెడికల్ ఆఫీసర్స్, డీహెచ్ఈ ఘనపురం వెంకటేశ్వర్లు, డీపీఎం సుధాకర్, స్నేహ సొసైటీ సిద్దయ్య, పీఎంవో రూప, మోయిజ్, నవీన్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేలు ఇవ్వాలి..

**అక్షరటుడే, కామారెడ్డి:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం ఇవ్వాలని భారతీయ కిసాన్ సంఘ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గురువారం కిసాన్ సంఘ్ ప్రతినిధులు జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాసంగి పంటలైన మెక్కజొన్న, జొన్న పంటలు కోతకు వచ్చాయని, వెంటనే రైతులకు సరిపడా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరారు. యూరియాతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, యాప్‌ను రద్దుచేసి రైతులకు యూరియాను సరఫరా చేయాలని కోరారు. రైతుల విస్తీర్ణం ప్రకారం రైతు భరోసా అందించాలని, ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. చెరుకు రైతుకు టన్నుకు రూ.800 బోనస్ ఇవ్వాలని, ప్రతి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని కోరారు. మొక్కజొన్న పంట ఎకరాకు 35 క్వింటాళ్లు, జొన్న పంట ఎకరాకు 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలన్నారు. తాము విన్నవించిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని, ఆలస్యమైతే రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు విఠల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ, ఇతర అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కార్మికులు మరణిస్తే ఆ కుటుంబానికి చేయూత అందిస్తోంది. లేబర్ కార్డు ఉన్న కార్మికులకు పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటు బీమా మొత్తాన్ని సైతం ఇటీవల పెంచింది. దీంతో ఈ కార్డు కోసం దరఖాస్తులు పెరుగుతున్నాయి.

- అక్షరటుడే, భీమ్‌గల్



# అసంఘటిత కార్మికులకు భరోసా..

■ ప్రమాద బీమా మొత్తాన్ని పెంచిన ప్రభుత్వం ■ లేబర్ కార్డు ఉంటే అర్హత ■ కార్డు కోసం పెరుగుతున్న దరఖాస్తులు

ప్రభుత్వం లేబర్ కార్డు (శ్రమశక్తి) కలిగి ఉన్న ప్రతి కార్మికుడికి కార్మిక శాఖ ద్వారా పెళ్లి కానుకలు, ప్రసూతి సాయం, ప్రమాద, సహజ మరణాలకు సంబంధించిన బీమా సౌకర్యాలను కల్పిస్తోంది. ఇటీవల ఈ బీమా మొత్తాన్ని ప్రభుత్వం పెంచింది. జిల్లాలో పనిచేస్తున్న తాపీ మేస్త్రీలు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు ఇలా దాదాపు 14 రంగాలకు చెందిన కార్మికులందరికీ ఈ పథకాలు వర్తిస్తాయని అధికారులు వెల్లడించారు.

**జిల్లాలో లేబర్ కార్డుల వివరాలు**

| ప్రాంతం | లేబర్ కార్డులు | లబ్ధిపొందిన వారు |
|---|---|---|
| నిజామాబాద్‌అర్బన్ | 65,420 | 10,250 |
| ఆర్మూర్ | 42,180 | 6,420 |
| బోధన్ | 38,500 | 5,100 |

### రూ.10 లక్షల బీమా

తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం కార్మికుడు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇచ్చే బీమా మొత్తాన్ని రూ. 10 లక్షలకు, సహజ మరణానికి ఇచ్చే మొత్తాన్ని రూ. 2 లక్షలకు పెంచారు. గతంలో ఉన్న తక్కువ బీమా మొత్తాన్ని పెంచడం ద్వారా కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం మరింత భరోసా కల్పిస్తోంది. కాగా జిల్లాలో కార్మికుల నమోదు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది.

### ప్రయోజనాలిలా..

- లేబర్ కార్డు కలిగి ఉన్న కుటుంబంలో ఇద్దరు ఆడపిల్లల పెళ్లికి ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు.
- మహిళా కార్మికులకు, లేదా కార్మికుడి భార్యకు ఇద్దరు పిల్లల వరకు ఒక్కొక్కరికి రూ. 30 వేల ప్రసూతి సాయం కింద అందజేస్తారు.
- కార్మికుడికి ప్రమాదవశాత్తు అంగవైకల్యం సంభవిస్తే తీవ్రతను బట్టి గరిష్టంగా రూ. 5 లక్షల వరకు పరిహారం.

### నమోదు చేసుకోవడం ఎలా?

లేబర్ కార్డు కోసం 18 నుంచి 60 ఏళ్ల లోపు వయస్సు ఉండి, ఏడాదిలో కనీసం 90 రోజులు నిర్మాణ రంగంలో పనిచేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డుల జిరాక్స్, ఫొటోలతో మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం సహాయ కార్మిక శాఖాధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి కార్డు జారీ చేస్తారు. ఈ కార్డు ఐదేళ్ల పాటు చెల్లుబాటులో ఉంటుంది. ఆ తర్వాత మళ్లీ రెన్యూవల్ చేసుకోవాలి.

### దరఖాస్తు చేసుకోవాలి

లేబర్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి. ప్రమాద బీమా పెంపుతో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భద్రత చేకూరుతుంది. అర్హులైన ప్రతి కార్మికుడు మీసేవ ద్వారా వెంటనే కార్డు కోసం నమోదు చేసుకోవాలి.

– యాదయ్య, జిల్లా సహాయ కార్మిక శాఖాధికారి, నిజామాబాద్

## సీపీడీ కమిటీ సభ్యుడిగా డాక్టర్ అరవింద్ గౌడ్



**అక్షరటుడే, కామారెడ్డి:** తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లోని కంటిన్యూయింగ్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ (సీపీడీ) కమిటీకి కోఆప్టెడ్ సభ్యుడిగా కామారెడ్డికి చెందిన పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ అరవింద్ గౌడ్‌ను నియమించారు. నేషనల్ మెడికల్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం రాష్ట్రంలో వైద్యులు తమ జ్ఞానాన్ని నిరంతరం నవీకరించుకోవడం తప్పనిసరి చేశారు. ఈ క్రమంలో ప్రతి వైద్యుడు ఏటా 5 క్రెడిట్ పాయింట్లు (సుమారు 40 గంటలు) కలిగిన సీపీడీ కార్యక్రమాలలో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ కమిటీ ద్వారా ప్రొఫెషనల్ సంస్థలు, బోధనా సంస్థలకు అక్రెడిటేషన్ ఇవ్వబడుతుంది. ఈ కార్యక్రమాల ద్వారా వైద్యులు తాజా వైద్య పరిజ్ఞానం, ఆవిష్కరణలను తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలాగే మెడికోలీగల్ అంశాలపై అవగాహన పెంపొందించడంపై కూడా ఈ కమిటీ దృష్టి సారిస్తోంది. అలాంటి కమిటీలో సభ్యుడిగా కామారెడ్డి జిల్లాకు అవకాశం రావడం హర్షణీయమని వైద్యులు పేర్కొన్నారు.

## రేపటి నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

**అక్షరటుడే, కామారెడ్డి:** రేపటి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. 2, 4, 6వ రెగ్యులర్, 1, 3, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం సెషన్ ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటల వరకు, మధ్యాహ్నం సెషన్ మధ్యాహ్నం 2 నుంచి 5 వరకు ఉంటుందని తెలిపారు. ఉదయం 10, మధ్యాహ్నం 2 గంటల తర్వాత వచ్చే విద్యార్థులకు లోపలికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, కళాశాల గుర్తింపు కార్డు తప్పనిసరిగా ఉంచుకోవాలని సూచించారు.



## ఆలూర్ నుంచి గుత్ప వరకు డబుల్ రోడ్డు మంజూరు: రాకేశ్ రెడ్డి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ నుంచి గుత్ప వరకు డబుల్ రోడ్డు మంజూరు చేయించామని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. ఆలూరు మండల రైతు వేదికలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రైతు వేదికలో 37మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, మూడు షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గుత్ప నుంచి ఆలూర్‌కు డబుల్ లైన్ రోడ్డు, కల్లెడ నుంచి ఆలూర్‌కు, ఆలూర్ గుత్పకు డబుల్ లైన్ రోడ్లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. అలాగే ఆలూరు గ్రామానికి బైపాస్ రోడ్డు కూడా అవసరమని గ్రామస్థులందరి ఏకాభిప్రాయంతో రోడ్డుకు చొరవ చూడాలన్నారు. రోడ్డుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆలూరు మండలాన్ని ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడంలో మండల ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సూర శ్రీకాంత్, కల్లెడ సర్పంచ్ సుస్మిత, మచ్చర్ల సర్పంచ్ కట్ట నర్సయ్య, హరీష్, మల్లయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం..: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో భక్త ఆంజనేయ మందిరంలో 22 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా.. సీపీ వాటిని ప్రారంభించారు. పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషమన్నారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. కాలనీలో కలిసికట్టుగా ఉండి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం బాగుందన్నారు. పట్టణంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం సీసీ కెమెరాలతోనే ఉంటుందని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చన్నారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, కౌన్సిలర్ విజయ్ అగర్వాల్ (దియా), జర్నలిస్ట్ కాలనీ అధ్యక్షుడు రాజేందర్ గౌడ్, సీసీ కెమెరాల ఇన్‌స్టాలేషన్ నిపుణుడు ప్రవీణ్ చారి, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.





## కాంగ్రెస్‌లో వ్యక్తిగత ఎజెండాలకు తావులేదు : బొబ్బిలి రామకృష్ణ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ పార్టీలో వ్యక్తిగత ఎజెండాలకు తావులేదని నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఎన్ఎస్‌యూఐ ఫౌండేషన్ డే సందర్భంగా నగరంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ.. 1971లో కేరళ స్టూడెంట్స్ యూనియన్, పశ్చిమ బెంగాల్ స్టేట్ ఛాత్ర పరిషత్‌లను విలీనం చేసి ఒక జాతీయ విద్యార్థి సంస్థను ఏర్పాటు చేశారన్నారు. 1971 ఏప్రిల్ 9న ఇందిరా గాంధీ ఆధ్వర్యంలో వాటిని కాంగ్రెస్ పార్టీకి అనుబంధ సంఘాలుగా విలీనం చేసుకుని నేషనల్ స్టూడెంట్ యూనియన్ ఆఫ్ ఇండియాగా ఆవిర్భవించిందన్నారు. జిల్లాకు చెందిన మహేష్ కుమార్ గౌడ్ తన రాజకీయాన్ని ఎన్ఎస్‌యూఐ విభాగం నుంచే ప్రారంభించి నేడు పీసీసీ చీఫ్‌గా ఎదిగారని గుర్తుచేశారు. అదేవిధంగా జిల్లాలో డి శ్రీనివాస్ సైతం ఎన్ఎస్‌యూఐ నాయకుడి నుంచి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడి వరకు తన ప్రస్థానం కొనసాగించారన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లు రెండు కాంగ్రెస్ పార్టీకి అనుబంధ విభాగాలని బొబ్బిలి రామకృష్ణ అన్నారు. వీటికి ప్రత్యేక ఎజెండాకు ఏమీ ఉండదని వ్యక్తిగత ఎజెండా కూడా ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆదేశాలను నియమాలను రెండు విభాగాలు పాటించాల్సి ఉంటుందని చెప్పారు. భవిష్యత్తులో ఎవరైనా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని వ్యక్తిగత ఏజెండాలు పెట్టుకొని పని చేయకూడదని స్పష్టం చేశారు. అలాగే ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షులు శరత్, జీవీ రామకృష్ణ, రాంభూపాల్, గన్ రాజ్, విపుల్ గౌడ్ తదితరులు ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శరత్ కుమార్, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జండా గుడి ఛైర్మన్ ప్రమోద్, నిజామాబాద్ కార్పొరేషన్ డీసీసీ కోశాధికారి శివకుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు దత్తు, కృపాల్‌సింగ్ పాల్గొన్నారు.

## గో ఆరాధన ఉద్యమానికి ప్రతి ఒక్కరి మద్దతు అవసరం: ఎమ్మెల్యే ధన్‌పాల్

**అక్షరటుడే, ఇందూరు :** జాతీయస్థాయిలో చేపట్టిన గో ఆరాధన ఉద్యమానికి ప్రతి ఒక్క హిందువు మద్దతు ఎంతో అవసరమని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. అఖిల భారత గో సమ్మాన్ అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి రాజ్యాంగానుసారంగా అహింసా మార్గంలో గో సంరక్షణ కోసం ఆరాధన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రధానంగా దేశంలో సంపూర్ణ గోహత్య నివారణ చేయడం, గోవును దేశమాతగా ఆరాధ్యనీయ దేశదేవతగా గుర్తించాలన్నారు. అలాగే గో పరిరక్షణ చట్టం, బోర్డును తీసుకురావాలన్నారు. వీటిని సాధించేందుకు ఈనెల 27న జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గో సమ్మాన్ అభియాన్ ప్రతినిధులు అనిల్ గోపాల్, కుషాల్ దాస్, భూపాల్ సింగ్, వీహెచ్‌పీ గోరక్ష విభాగం తెలంగాణ ప్రాంత కృషి ప్రముఖ్ ధాత్రిక రమేష్, ఇందూరు గో సేవా సమితి అధ్యక్షుడు వీరమల్లి రమేష్, లక్ష్మీకాంతం, యాదగిరి, రజినీకాంత్, వెంకటరమణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## హెచ్‌ఎంఐఎస్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు హెచ్‌ఎంఐఎస్ (హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్)పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో రాజశ్రీ మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు రోజు వారి విధుల్లో అందించే వైద్య ఆరోగ్య సేవలను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా గర్భిణుల పేర్ల నమోదు, ఆస్పత్రుల్లో జరిగిన ప్రసవాలు, వ్యాధి నిరోధక టీకాలు, మాతాశిశు మరణాలు, జీవనశైలి వ్యాధులపై చేస్తున్నటువంటి నిర్ధారణ పరీక్షలన్నింటిని వెంటవెంటనే హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో ఎంట్రీ చేయాలని సూచించారు. అందరూ ప్రతిరోజు సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. ఈ శిక్షణను డీడీఎం నారాయణ, హెచ్‌ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. శిక్షణలో ఆర్మూర్ డివిజన్ చెందిన పీహెచ్‌సీల ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.



## సమాజ సేవలో ముందుండాలి: ధన్‌పాల్

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** సమాజ సేవలో ప్రతి ఒక్కరూ ముందుండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. ధన్‌పాల్ లక్ష్మీబాయి, విఠల్ గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని పీఎల్‌ఎంఎస్ పెట్రోల్ బంక్ ఎదురుగా అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నగరవాసుల సౌకర్యార్థం అంబలి పంపిణీ చేస్తున్నామన్నారు. ఎండ దెబ్బ, వేడి నుంచి అంబలి ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. కేంద్రాన్ని 12 ఏళ్లుగా కొనసాగిస్తున్నారని, నాలుగేళ్లుగా తమ ట్రస్ట్ సహకరిస్తుందని చెప్పారు. ప్రధానంగా గ్రామీణులు అధిక సంఖ్యలో వస్తారని, వారికి ఆసరాగా ఉంటుందనే ఉద్దేశ్యంతో అంబలి పంపిణీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంబలి కేంద్ర ప్రతినిధి పార్శి రమేష్, కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీ నారాయణ, బట్టు రాఘవేందర్, జ్యోతి మురళి, బంటు ప్రీతి ప్రవీణ్, మల్కాయి మహేందర్, మఠం పవన్, మల్లేష్ యాదవ్, కల్పె అర్చన చిరంజీవి, ఎర్రం ప్రభాకర్, గజవాడ ఆగమయ్య, మంచోల్ల రామస్వామి, రాజబాబు పాల్గొన్నారు.



# దళారుల 'పంట' పండుతోంది..

- ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు
- స్పందించని అధికారులు..

**యాసంగి వరికోతలు ప్రారంభమైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తప్పని పరిస్థితుల్లో అకాల వర్షాలకు భయపడి రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.**

**– అక్షరటుడే, మాక్లూర్**

ఉమ్మడి మాక్లూర్ మండల వ్యాప్తంగా వరిపంట కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యం కోతలు పూర్తి చేసిన రైతులు వడ్లను కుప్పలుగా పోసి కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. కానీ ఇప్పటివరకు అధికారులు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కర్షకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారి చేతికొచ్చిన పంటను నష్టపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అకాల వర్షాలకు భయపడి..

ప్రస్తుతం అకాల వర్షాలకు భయపడుతున్న అన్నదాతలు కోసిన వరిధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి మాక్లూర్ మండలంలో చిక్కిలి, గుంజలి, కొత్తపల్లి, దీకంపల్లి, కల్లెడ, గుత్ప, రాంచంద్రపల్లి గ్రామాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అధిక శాతం రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మేస్తున్నారు. దీంతో ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు, బోనస్ కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### వారం రోజుల్లో కోతలు చివరి దశకు..

మరో వారం రోజుల్లో వరికోతలు చివరి దశకు చేరనున్నాయి. అయినా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం. సొసైటీ ఆధ్వర్యంలో అధిక కేంద్రాలు నిర్వహిస్తుంటారు. అయితే ఈ ఏడాది పాలకవర్గాలు రద్దవడంతోనే కొంత ఆలస్యం అవుతుందని తెలుస్తోంది. కానీ ఈ పరిణామంతో తాము మాత్రం తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు.

### కేంద్రాలు ప్రారంభించాలి

ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం ఇదే తొలిసారి. గ్రామాల్లో మరో వారం రోజుల్లో కోతలు పూర్తవుతాయి. ఇప్పటికే ధాన్యం రాసులు పేరుకుపోయాయి. కొందరు రైతులు అకాల వర్షాలకు భయపడి తక్కువ ధరకే దళారులకు విక్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలి.

**– ప్రశాంత్, రైతు, మాక్లూర్**

## అంధత్వ నివారణకు కంటి పరీక్షలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో అంధత్వ నివారణ సమితి, బాన్సువాడ లయన్స్ క్లబ్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 48 మంది రోగులను పరీక్షించారు. ఇందులో ఆరుగురికి శస్త్రచికిత్స నిమిత్తం బాన్సువాడ లయన్స్ ఐ ఆస్పత్రికి రిఫర్ చేశారు. మరో 23 మందికి కళ్లద్దాలు అందజేశారు. ఒకరిని సరోజని దేవి కంటి ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, ఆర్ఎంవో శ్రీనివాస్, పీఎం ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## దేగాంలో సమస్యల పరిశీలన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం దేగాం బస్టాండ్ ప్రాంతంలో పూడుకుపోయిన కల్వర్టును పంచాయతీరాజ్ శాఖ డీఈ కిషన్, ఏఈ నితీష్, సర్పంచ్ ఇట్టెడి లింగారెడ్డి గురువారం పరిశీలించారు. కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మురుగు, వర్షపు నీరు నిలిచిపడి సమీప ఇళ్లలోకి చేరుతున్నట్లు గుర్తించారు. వర్షాకాలంలో ఈ ప్రాంతం చెరువులా మారి స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్ తెలిపారు. అదేవిధంగా గ్రామంలోని నిజాంసాగర్ కాలువపై ఉన్న కల్వర్టు సమస్యపై పంచాయతీరాజ్ అధికారులు ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ శాఖ అధికారులతో ఫోన్‌లో చర్చించారు. సమస్యను ఉన్నతాధికారులకు నివేదించి త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు.

## మచ్చర్ల గ్రామంలో ప్లాస్టిక్ నిషేధం

**అక్షరటుడే, ఆర్మూర్:** అలూర్ మండలం మచ్చర్ల వీడీసీ, జీపీ ఆధ్వర్యంలో ఆదర్శ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తూ తీర్మానం చేశారు. సర్పంచ్ కట్ట మల్లవ్వ నర్సయ్య ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో ఉన్న కిరాణా దుకాణాలు, దుస్తుల షాప్‌లు, హోటళ్లు, బేకరీలు, మెడికల్ షాపులు, అంగడి బజార్లలో ప్లాస్టిక్ కవర్లు, ప్లేట్లు, గ్లాసుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. హోటళ్లలో ప్లాస్టిక్ గ్లాసుల బదులుగా స్టీల్ గ్లాసులు ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా యువతకు సిగరెట్లు, మత్తు పానీయాలు, పాన్, గుట్కా వంటి హానికర పదార్థాల విక్రయాన్ని కూడా నిషేధిస్తూ గ్రామస్థులు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ.5,000 జరిమానా విధిస్తామని గ్రామ పంచాయతీ సభ్యులు హెచ్చరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో మహిళా



సంఘ సభ్యులకు 500 ప్లేట్లు, 200 స్టీల్ గ్లాసులు పంపిణీ చేయగా, హోటళ్లకు 100 స్టీల్ గ్లాసులు ప్రతి ఇంటికి రెండు చొప్పున బ్యాగులు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కట్ట నర్సయ్య, మహేందర్, పోశన్న, గంగారెడ్డి, శ్రీనివాస్, లింగమయ్య, భూమన్న, జగదీష్, గంగారాం, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోటు రంగారావుపై కేసు ఉపసంహరించుకోవాలి





**అక్షరటుడే, ఆర్మూర్:** సీపీఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావుపై పెట్టిన దేశద్రోహం కేసును వెంటను ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శి బి దేవారం, ముత్తెన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాభై ఏళ్లుగా ప్రజాసేవ చేస్తూ ప్రజాఉద్యమాలు చేస్తున్న తమ పార్టీ కార్యదర్శిపై దేశద్రోహం, ఉపా చట్టాలు పెట్టడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రజల కోసం ప్రశ్నించిన వారిపై ఎన్ఐఏ, ఈడీ, సీబీఐలతో గొంతు నొక్కాలని చూస్తోందన్నారు. అడవుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో ప్రజల కోసం పోరాటం చేస్తున్న మావోయిస్టులను మట్టుబెడుతున్నారని.. అలాగే ప్రజల్లో ఉంటూ ప్రజా ఉద్యమాలు చేస్తున్నవారిపై దేశద్రోహం కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే రంగారావుపై పెట్టిన కేసును ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సబ్ డివిజన్ నాయకులు రాజన్న, నరేందర్, దుర్గాప్రసాద్, టీయూఐసీ జిల్లా కోశాధికారి అరవింద్, నాయకులు నజీర్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి : సీపీ



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఆర్మూర్ డివిజన్ పరిధిలోని సర్పంచ్‌లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అతివేగం, నిద్రమత్తు, నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. గ్రామ స్థాయిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

**అక్షరటుడే, ఇందూరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో గురువారం నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని మేయర్ ఉమారాణి ప్రారంబించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎండాకాలం నేపథ్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని స్వచ్ఛంద సంస్థలు తాగునీరు, మజ్జిగ, అంబలి పంపిణీకి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి, పి రాఘవేందర్, పూర్వాధ్యక్షులు డి యాదగిరి, పి లక్ష్మీనారాయణ, బి గురుప్రసాద్, కరిపె రవీందర్, పుల్గం హన్మాండ్లు, రమేష్, చింతల గంగాదాస్, రీజియన్ ఛైర్మన్ ఉదయ సూర్యభగవాన్, జోన్ ఛైర్మన్ భూమన్న, ఉపాధ్యక్షులు రవీంద్రనాథ్ గుప్తా, ప్రోగ్రామ్ ఛైర్మన్ జైపాల్ కాలే తదితరులు పాల్గొన్నారు.

## గిరిరాజ్ కళాశాలలో ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని గిరిరాజ్ కళాశాలలో ఘనంగా ఎన్‌ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరదబట్టు వేణురాజ్ జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, స్వేచ్ఛ, నాణ్యమైన విలువల ఆధారంగా బాధ్యతాయుతమైన పౌరులు, నాయకులను రూపొందించేందుకు ఎన్‌ఎస్‌యూఐ కృషి చేస్తోందన్నారు. కేరళ విద్యార్థి సంఘం, పశ్చిమ బెంగాల్ ఛత్ర పరిషత్‌లను విలీనం చేస్తూ 1971లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఎన్‌ఎస్‌యూఐని ఏర్పాటు చేశారన్నారు. నేడు దేశంలోని అతిపెద్ద విద్యార్థి సంఘంగా నిలబడిందన్నారు. ఎన్‌ఎస్‌యూఐ ప్రతిఒక్క విద్యార్థికి చిన్ననాటి నుంచే ప్రశ్నించే తత్వం సమస్యలపై పోరాడేతత్వం నాయకత్వ లక్షణాలను నేర్పుతుందన్నారు. జిల్లాలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశామని వేణురాజ్ అన్నారు. విద్యార్థి వ్యతిరేక కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నిరసిస్తూ ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడంలో నిజామాబాద్ ఎన్‌ఎస్‌యూఐ ముందుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సాయి కిరణ్ రెడ్డి, శివ, హరీష్, కౌశిక్, శివ, గణేష్ రెడ్డి, కనకరాజ్, మనీష్, దినేష్, గిరిరాజ్ ప్రభుత్వం కళాశాల విద్యార్థులు వికాస్, రాహుల్, చిన్నయ్య, అభిలాష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్టీయూ బలోపేతానికి కృషి చేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లాలో పీఆర్టీయూ బలోపేతానికి కృషి చేయాలని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్ రావు అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో గురువారం పీఆర్టీయూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. జెండాను ఆవిష్కరించిన అనంతరం మనోహర్ రావు మాట్లాడుతూ.. పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి నాయకత్వంలో ఉపాధ్యాయుల పక్షాన పోరాడే సంఘంగా పీఆర్టీయూకు పేరుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజం, రాష్ట్ర, జిల్లా బాధ్యులు గిరి, శ్రీధర్ రావు, నరసింహారెడ్డి, సురేందర్, రాము, ఎల్లాగౌడ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలుశిక్ష

**అక్షరటుడే నిజామాబాద్ క్రైం:** డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ ముగ్గురికి న్యాయస్థానం జైలుశిక్ష విధించింది. ఈ మేరకు ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ వివరాలు వెల్లడించారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నగరంలో తనిఖీలు నిర్వహిస్తుండగా 13మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా ముగ్గురికి వారం రోజుల పాటు జైలుశిక్ష విధించారని.. మరో 10మందికి ఒక్కొక్కరికి రూ. 10వేల చొప్పున జరిమానా విధించినట్లు ఏసీపీ తెలిపారు.